ప్రజాశక్తి
శుక్రవారం 18 జులై 2025 5
శ్రీ సత్యసాయి

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చుట్టూ నిర్మించిన ప్రహరీ

'మాకివ్వాల్సింది ఇచ్చుకోండి... మీకావాల్సింది దండుకోండి'..! అన్న చందంగా ఎక్సైజ్ శాఖ పనితీరు మారిందనే విమర్శలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు బెల్ట్‌షాపులు లేకుండా చేస్తామని ప్రకటిస్తుంటే ఆచరణలో మాత్రం ఊరూరా బెల్ట్‌షాపులే నడుస్తుండటం గమనార్హం. నిబంధనలను సైతం తుంగలోకి తొక్కి ఎంఆర్‌పికి మంగళం పాడారు. జిల్లా కేంద్రం మొదలుకుని గ్రామీణ ప్రాంతం వరకు ఎక్కడా ఎంఆర్‌పి అమలు జరుగుతున్న దాఖలాల్లేవు. అంతా బహిరంగంగా నడుస్తున్నా నివారించాల్సిన ఎక్సైజ్ శాఖ మిన్నకుండిపోవడం అనేక ఆరోపణలకు తావిస్తోంది. నెలవారీగా మద్యం దుకాణాల నుంచి ఒక ధరను ఫిక్స్ చేసి వసూళ్ల పర్వం సాగుతోందన్న ఆరోపణలున్నాయి. దీంతో మద్యం విక్రయాలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది.

గతేడాది విక్రయాలకంటే 92 శాతం అధికంగా ఈ త్రైమాసికంలో జరగడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

మాకిచ్చుకోండి...మీరు దండుకోండి..!

◆ ఊరూరా బెల్ట్‌షాపులు

◆ ఎమార్పీ కంటే అదనంగా అమ్మకాలు

◆ మద్యం విక్రయాల్లో నిబంధనలు గాలికి

◆ తనిఖీ యాప్‌లు మద్యం విక్రేతల వద్దనే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలున్నాయి. జనాభా ప్రతిపాదికన ఈ మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈ దుకాణాల్లో మాత్రమే విక్రయాలు జరగాల్సి ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో మద్యం విక్రయాలు జరగాలి. కాని ఎక్కడా ఎంఆర్‌పి అమలు జరుగుతన్న దాఖలాల్లేవు. ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూళ్లు జరుగుతున్నాయి. ఇదేదో మారుమూల ప్రాంతంలోనే కాదు... అనంతపురం నగరంలోనూ అధిక ధరకే విక్రయాలు నడుస్తున్నాయి. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామంలో సగటున మూడు వరకు బెల్ట్‌షాపులు నడుస్తున్నాయి. ఈ బెల్ట్‌షాపులు నిర్వాహకులు మద్యం దుకాణాల వద్ద రూ.50 వేల వరకు డిపాజిట్ చేసి మరీ కొనుగోలు చేస్తున్నారు. వీరు కూడా ఎంఆర్‌పి కంటే రూ.10 అదనంగా పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఇక ఈ బాటిళ్లపై ఒక్కో దానిపై రూ.30 వరకు అదనపు ధరకు మద్యం విక్రయాలు నడుస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ స్థాయిలో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నా నివారించాల్సిన ఎక్సైజ్ శాఖ మిన్నకుండిపోవడం వెనుక పెద్ద మతలబే ఉందన్న ఆరోపణలున్నాయి. ఒక్కో మద్యం దుకాణం నుంచి రూ.45 వేల వరకు ఆ శాఖకు ముడుపుల రూపంలో నెలనెలా అందుతున్నట్టు ఆరోపణలున్నాయి. వీటిని ఉన్నతాధికారుల వరకు చేరుతున్నట్టు ఎక్సైజ్ శాఖలోనే చర్చ నడుస్తోంది. కొన్ని చోట్ల పర్మిట్ రూములు కూడా నడుస్తున్నా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపంచడం లేదు.

మసకబారిన నిఘా

మద్యం విక్రయాల్లో నిబంధనలు పాటించకుండా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేకంగా నిఘా విభాగాలున్నాయి. ఇఎస్‌టిఎఫ్, విజిలెన్స్ విభాగాలున్నాయి. ఎక్కడైనా నిబంధనలు పాటించకపోతే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నిఘా సంస్థలు కూడా నామమాత్రపు చర్యలతోనే సరిపెడుతున్నట్టు ఆరోపణలున్నాయి. ప్రతి నిత్యం ఆయా సర్కిళ్ల పరిధిలో సిబ్బంది తనిఖీలు నిర్వహించాలి. పోలీసు స్టేషన్‌కు వెళ్లి జిపిఎస్‌లో పంచింగ్ చేయాల్సి ఉంది. ఎక్సైజ్ ఐపి యాస్ కేవలం సిబ్బంది వద్ద మాత్రమే ఉండాలి. ఇందుకు భిన్నంగా ఆ యాప్‌ను మద్యం విక్రేతల మొబైల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసి వారి ద్వారా పంచింగ్ చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ రకంగా తనిఖీలను మమ అనిపించేస్తుండటం విశేషం.

92 శాతం అధికం

మద్యం విక్రయాల పరంగా చూసినా అమ్మకాలు ఏ మేరకు సాగుతున్నాయన్నది స్పష్టం చేస్తోంది. 2024లో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మొదటి త్రైమాసికంలో 3.51 లక్షల కేసులు అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది అంటే 2025 ఏప్రిల్ నుంచి జూన్ వరకు చూస్తే 6.74 లక్షల కేసులు అమ్మకాలు జరిగాయి. సాధారణం కంటే 92 శాతం అధికంగా అమ్మకాలు జరిగాయి. ఆదాయం పరంగానూ అంతకు మునుపు త్రైమాసికంలో రూ.226.47 కోట్లుకాగా, ఈ ఏడాది రూ.302.78 కోట్లు అమ్మకాలు జరిగాయి.

ప్రభుత్వ స్థలం.. కబ్జాల పర్వం..!

◆ నలుగురికి ఇళ్లపట్టాలిస్తే 40 సెంట్లు ఆక్రమణ

◆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం

◆ రెవెన్యూ,మున్సిపల్ అధికారుల చర్యలు శూన్యం

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ భూములను కొందరు ఎంచక్కా కబ్జా చేస్తున్నారు. వాటిని విక్రయించి రూ.లక్షలు గడిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలపై కన్నేసి వాటిని స్వాధీనం చేసుకుని ప్లాట్లు వేసి ఇతరులకు విక్రయించేస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని పెనుకొండ పట్టణం, సమీప ప్రాంతంలో నివేశ స్థలాలకు డిమాండ్ ఉంది. స్థలాలకు విలువ పెరగడంతో కొందరు భూ దందాకు తెరలేపారు. వీరికి రాజకీయ అండదండలు ఉండటంతో రెవెన్యూ అధికారులు మౌనం వహిస్తున్నారు. భూ అక్రమణలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు వినపడుతున్నాయి. ప్రభుత్వ స్థలంలో నలుగురు ఇళ్ల పట్టాలు తీసుకుని ఏకంగా 40 సెంట్లు భూమిని అక్రమించారు. ఈ స్థలానికి అంతా దర్జాగా ప్రహరీ నిర్మించారు. పెనుకొండ మున్సిపాల్టీ పరిధిలోని కొండాపురం గ్రామంలో ఈ కబ్జా వ్యవహారం బహిరంగంగా జరిగినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

కొండాపురం గ్రామం సర్వే నెంబర్ 708లో 6ఎకరాల గ్రామ కంఠం భూమి ఉంది. ఇల్లు లేని పేదలకు ఈ భూమిలో గతంలో రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. ఈ సర్వే నెంబర్‌లో మిగిలిన 2 ఎకరాలు ఎన్‌పి.నరసింహారెడ్డి, ఎన్‌పి.సూర్యనారాయణ రెడ్డి వారి ఆధీనంలో ఉంచుకున్నారు. ఇదే భూమిలో1995లో వీరి కుటుంబ సభ్యులు నలుగురి పేరుపైన మూడు సెంట్లు ప్రకారం రెవెన్యూ అధికారులు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. నరసింహారెడ్డి 40 సెంట్లు భూమికి ప్రహరీ నిర్మించి తన ఆధీనంలో ఉంచుకున్నారు. సూర్యనారాయణ రెడ్డి షెడ్లు నిర్మించి పశుగ్రాసం పెట్టారు. ఈ విషయంపై గ్రామస్తులు రెవెన్యూ మున్సిపల్ అధికారులకు పలు సార్లు ఫిర్యాదు చేశారు.

చుట్టుపక్కల కుటుంబాలకు ఇబ్బందులు

ఎన్‌పి.సూర్యనారాయణ రెడ్డి, ఎన్‌పి.నరసింహ రెడ్డి కుటుంబాలు భూమిని ఆక్రమించడంతో చుట్టుపక్కల కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేయడంతో రైతులకు దారి లేక ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లకు వెళ్లటానికి ఏర్పాటు చేసుకున్న దారి పూర్తిగా మూసుకుని పోయింది. అక్రమంగా నిర్మించిన ప్రహరీ కూల్చివేసి దారిని పునరుద్ధరణ చేయాలని ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు.

రెవెన్యూ,మున్సిపల్ అధికారుల చర్యలు శూన్యం

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన విషయంపై కొండాపురం గ్రామస్తులు రెవెన్యూ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహశీల్దార్ స్వాతి కబ్జా స్థలాన్ని పరిశీలించారు. తక్షణం చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తహశీల్దార్ హామీ ఇచ్చి 15 రోజులు గడిచినా ఇంతవరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది వీఆర్వోలు ఆ స్థలాన్ని పరిశీలించి తక్షణం ప్రహరీని తొలగించాలని సూచించినప్పటికీ ఆక్రమణదారులు పట్టించుకోని పరిస్థితి ఉంది.

చుట్టుపక్కల ప్రజలకు నడవడానికి దారి లేకుండా నిర్మించిన అడ్డుగోడ

నోటీసులు పంపుతాం

స్వాతి, తహశీల్దార్.

ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మించిన కబ్జాదారులకు నోటీసులు పంపుతున్నాం. ఈస్థలం మున్సిపల్ పరిధిలో ఉందని కమిషనర్‌కు లేఖ రాశాం. ప్రభుత్వ భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరం.

త్వరలోనే చర్యలు తీసుకుంటాం

సతీష్ కుమార్, కమిషనర్.

ప్రభుత్వ భూమి ఆక్రమించి అనుమతులు లేకుండా ప్రహరీ నిర్మాణంపై త్వరలోనే చర్యలు చేపడతాం. అనుమతులు లేకుండా ఎవరైనా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తాం. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తాం

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

ఉదయం 11 గంటలైనా ఖాళీగానే కుర్చీలు

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని మందలపల్లి గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. వారు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు కుర్చీలో ఉంటారో.. ఎప్పుడు వెళ్తారో తెలియడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇందుకు నిదర్శనం గురువారం ఉదయం 11 గంటల సమయంలో మందలపల్లి సచివాలయం తలుపులు తెరిచినా ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడమే. దీంతో వివిధ సమస్యలపై సచివాలయానికి వచ్చిన ప్రజలకు ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడంతో అర్జీలు చేతిలో పట్టుకుని ఉద్యోగుల కోసం పడిగాపులు కాశారు. ఈ విషయమై మందలపల్లి సెక్రెటరీ జయపాల్‌రెడ్డిని ఫోన్ ద్వారా సంప్రదించగా బూదిలి సచివాలయ ఇన్‌ఛార్జిగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారని, బూదిలిలో ఉన్నానని చెప్పారు. మిగతా సిబ్బంది ఎక్కడికి వెళ్లారో తెలిపే వారు కూడా కరువయ్యారు. ఈ విషయంపై ఎంపిడిఒకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

మందలపల్లి సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

'మీ ఎంపిటిసిలపై నమ్మకం ఉంటే ఎందుకు రాలేదు'

మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

రామగిరి మండలంలో మెజార్టీ బలం ఉన్నా ఎంపిపి స్థానాన్ని నిలబెట్టుకోలేని అసమర్థుడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. రామగిరి ఎంపిపి ఎన్నిక కోరం లేక 3వ సారి వాయిదా పడిన నేపథ్యంలో తనపై చేస్తున్న విమర్శలపై ఎమ్మెల్యే సునీత ఘాటుగా స్పందించారు. రామగిరి మండలంలోని వెంకటాపురం లోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే ఎంపిపి ఎన్నికకు 3 సార్లు నోటిఫికేషన్ వచ్చిందన్నారు. ఎన్నిక జరిగిన ప్రతిసారీ వారి పార్టీ ఎంపిటిసిలను వారే బలవంతంగా క్యాంపులకు తరలించుకుని.. ఆ తర్వాత తామేదో చేసినట్టు ప్రకాష్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారన్నారు. మా సొంత మండలంలో దౌర్జన్యం చేస్తున్నారంటూ విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మెజార్టీ సభ్యులు మీ వైపు ఉన్నప్పుడు.. వారిపై నీకు నమ్మకం ఉంటే.. ఎందుకు ఎంపిపి ఎన్నికకు హాజరు కాలేదని నిలదీశారు. సొంత పార్టీ ఎంపిటిసిలపై నీకు నమ్మకం లేక నువ్వు డ్రామాలు ఆడటం.. గొడవలు సృష్టించడం అందరికీ తెలుసన్నారు. ఈ ఎంపిపి స్థానాన్ని మేము కైవసం చేసుకోవాలనుకుంటే ఏ రోజో తమ చేతుల్లోకి తీసుకునేవాళ్లమన్నారు. ఎంపిపిని గెలుచుకోవడం వల్ల తమకు అదనంగా వచ్చేది కానీ.. పోయేది కానీ ఏమీ లేదన్నారు. పైగా మరో 8 నెలల్లోపు ఎన్నికలు వస్తుంటే కొత్తగా దీనికి ఎందుకు ప్రయత్నిస్తామని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో గొడవలు సృష్టించి.. నీతో పాటు మీ పార్టీ కార్యకర్తలను కూడా కేసుల్లో ఇరుక్కునేలా చేశావన్నారు. నువ్వు ఇప్పుడు వారిని కూడా వదిలేసి పారిపోయావని.. మీ పార్టీ నాయకులపై అది నీకున్న చిత్తశుద్ధి అన్నారు. కలుగులో దాక్కోవడం కాదు.. ధైర్యంగా బయటకొచ్చి మాట్లాడు అంటూ సవాల్ చేశారు. కేసులకు భయపడి పారిపోయే నీకు మా గురించి మాట్లాడే స్థాయి ఉందా అని నిలదీశారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

సిపిఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మడకశిర

ఈ నెల 27, 28 తేదీల్లో కదిరి పట్టణంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు యోగానంద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కెవిపిఎస్, సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నిత్యం సామాన్య ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిజాయితీగా నిస్వార్థంగా పాటుపడుతున్న పార్టీ సిపిఎం అన్నారు. సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోవిందప్ప, కార్యదర్శి రవి, ముత్యాలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని బస్టాండ్ నుంచి రావికుంటచెరువు కట్ట వరకూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను గురువారం జెసిబి సాయంతో తొలగించారు. బస్టాండ్ నుంచి రావికుంటచెరువు కట్ట వరకూ సీసీ రోడ్డు మంజూరైంది. దీంతో ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి యజమా నులకు పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా వారు అక్రమ నిర్మాణాలను తొలగించుకోకపోవడంతో పంచాయతీ సిబ్బందే జెసిబిలతో తొలగించారు. ఈ మార్గంలో అక్రమ నిర్మాణాలు తొలగించడం వల్ల ట్రాఫిక్ సమస్య తీరిందని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గోరంట్లలో రోడ్డుకు అడ్డంగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న జెసిబి

కెజిబివిలో ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (కెజిబివి)లో గురువారం ప్రిన్సిపల్ నాగరత్న ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. 'విజయపథం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆర్.మరువపల్లి కెజిబివిలో మంగళవారం నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతు లను పాఠశాల సమయం కంటే ముందుగానే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలనే ఉద్దేశంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యా శక్తి కార్యక్రమాన్ని ఉదయం 5 నుంచి 6 గంటల వరకూ నిర్వహిస్తున్నామన్నారు. సోమ, మంగళ, బుధవారాల్లో 6, 7తరగతులకు, గురు, శుక్ర, శనివారాల్లో 8, 9 తరుగతులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కెజిబివిలో ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపల్ నాగరత్న

యాదవుల అభివృద్ధికి సహకరించాలని వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

యాదవుల అభివృద్ధికి సహాయ, సహకరించాలని కోరుతూ స్థానిక శ్రీవేణుమాధవ వెల్ఫేర్ సొసైటీ సంఘం ఆధ్వర్యంలో గురువారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి, సిడబ్ల్యుసి సభ్యులు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డిని వారి నివాసాల్లో మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. సోమందేపల్లిలో ఆగష్టులో జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ జనాభా నిష్పత్తి ప్రకారం యాదవులు అత్యధిక శాతం ఉన్నా ఈ ప్రాంతంలో విద్య, వైద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. కావున యాదవులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సోమందేపల్లి మండల యాదవ సంఘం అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి గోపాల్ యూత్ అధ్యక్షుడు మైలార్, రాజ గోపాల్, యూత్ ప్రచార కార్యదర్శి రమేష్, శ్రీనివాస్, రాజగోపాల్, ఓబులేష్, సదాశివ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని జూలుకుంట గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గురువారం దుర్గాశక్తి సొసైటీ అధ్యక్షులు ముంతాజ్ ఆధ్వర్యంలో టింబక్టు కలెక్టివ్ వారు ఉచిత న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాలు, మద్యపానం వల్ల జరిగే నష్టాలను నాటిక ద్వారా ప్రజలకు తెలిపారు. వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళా చట్టాలు, వాటి ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి కవిత, మహాశక్తి సంస్థ సీఈఓ రమీజా, డైరెక్టర్ నాగమ్మ, లక్ష్మమ్మ, కిష్టమ్మ పాల్గొన్నారు.

ఆర్‌డిటి కోసం విద్యార్థుల పోస్ట్‌కార్డు ఉద్యమం

ప్రజాశక్తి-సోమందేపల్లి

కేంద్ర ప్రభుత్వం ఆర్‌డిటి సంస్థకు వెంటనే ఎఫ్‌సిఆర్ ఎను పునరుద్ధరించాలని కోరుతూ గురువారం స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టారు. పాఠశాలలోని సుమారు 800 మంది విద్యార్థులు పోస్ట్‌కార్డ్‌లో రాసి పోస్ట్‌బాక్స్‌లోకి వేశారు. విద్యార్థులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపు రం జిల్లాలో ఆర్‌డిటి సంస్థ ఎన్నో రకాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. అలాంటి స్వచ్ఛంధ సంస్థకు కుల, మత, రాజకీయాలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరారు. పోస్ట్‌కార్డు ఉద్యమంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులంతా పాల్గొనాలని కోరారు.

లేపాక్షి : ఆర్‌డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరుతూ మండలంలోని కల్లూరు హైస్కూల్, కెజిబివి విద్యార్థులు ఆర్‌డిటి అభిమాన సంఘం సభ్యులు ఆధ్వర్యంలో కల్లూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు ఆర్‌డిటి సంస్థ ప్రాధాన్యతని వివరించారు. అనంతరం విద్యార్థులు పోస్ట్‌కార్డులను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు పంపారు.

సోమందేపల్లిలో పోస్ట్‌కార్డు చూపుతున్న విద్యార్థులు

వైసిపి నాయకులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మడకశిర

మండలం వైసిపి నాయకులు గురువారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. మండలంలోని యు.రంగాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కాశీంసాబ్, ఇమామ్ సాబ్, ఆరిఫ్, సయ్యద్ హుస్సేన్, హుస్సేన్, దస్తగిరి, నూరుల్లా, కరీం, చాంద్, వాజిద్, తిమ్మరాజు, వెంకట రమణప్ప, దినేష్, హిమావు, షబ్బీర్, నరసింహ మూర్తి, కోరలగౌడ్, మెళవాయి నాగరాజు, రవితో పాటు 20 కుటుంబాలు టిడిపిలో చేరగా గుండుమల పసుపు కండువా వేశారు. రాష్ట్రం, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సుబ్బా రెడ్డి, మంజునాథ్, రఘురాం, కాశీం, శీన, అంజి పాల్గొన్నారు.

ఘనంగా కల్పవల్లి మహాసభ

ప్రజాశక్తి-రొద్దం

టింబక్టు కలెక్టివ్ సంస్థ సహకారంతో 33 ఏళ్లుగా ఉమ్మడి భూముల సంరక్షణ, పునరుజ్జీవన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గంగోలి తెలిపారు. మండలంలోని కోగిర సంరక్షణ ప్రాంతంలో గురువారం కల్పవల్లి వృక్ష పెంపకందారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో 17వ వార్షిక మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గంగోలి ఈ ఏడాదిలో జరిగిన కార్యక్రమాలు, నివేదిక, ఆర్థిక, ఆడిట్, రిపోర్ట్, కొత్త ఆడిటర్ ఎంపిక, కల్పవల్లి సొసైటీ పాలకవర్గ మార్పులు, చేర్పులపై మాట్లాడారు. మేరీ వట్టమట్టం మాట్లాడుతూ కల్పవల్లి సంరక్షణ ప్రాంతంలో మహిళల పాత్ర చాలా కీలకమని తెలిపారు. యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముష్టికోవెల గ్రామం యువత కోలాటం ప్రదర్శించారు. భవానీ, శీను వేసిన మాయలపకీరు పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో 11 గ్రామాల వన రక్షణ కమిటీ సభ్యులు, ప్రెసిడెంట్లు, డైరెక్టర్లు, టింబక్టివ్ కలెక్టివ్ సిబ్బంది, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సుకన్య, కల్పవల్లి సీఈఓ చిరంజీవి, ప్రకృతి వర్కింగ్ గ్రూప్ మేనేజర్ శ్రీకాంత్, దూహిత, కల్పవల్లి కార్యకర్తలు, 380 మంది సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 2 ఆధ్వ ర్యంలో గురువారం శ్రమదానం చేశారు. కళాశాల ఆవరణలో కలుపు, పిచ్చి మొక్కలు తొలగించారు. మొక్కల చుట్టూ పాదులు చేసి శుభ్రం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి జయప్ప మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని, సమాజ సేవలో తమ వంతు తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రతాప్, తెలుగు అధ్యాపకులు రామన్న, కామర్స్ అధ్యాపకులు చంద్రమోహన్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై కేంద్ర బృందం తనిఖీ

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షి గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం కేంద్ర బృందం సభ్యులు రామాంజనేయులు, అనంత్ పర్యటించారు. వారు అగన్వాడీ సెంటర్, ఆసుపత్రి, నీలం సంజీవరెడ్డి ఒరియంటల్ హై స్కూల్, వీరభద్రసౌమి ఆలయాలను సందర్శించి స్వచ్ఛతపై ఆరా తీశారు. టాయిలెట్‌లు ఎలా నిర్వహిస్తున్నారో తనిఖీ చేశారు. వారి వెంట ఎంపిడిఒ నరసింహమూర్తి, డిప్యూటీ ఎంపిడిఒ, పంచాయతీ సెక్రటరీ నాగరాజు, వైద్యాధికారి రాజ్‌కుమార్, ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ సాహితీ, విజయ్‌కుమార్ ఉన్నారు.

నసనకోటను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

నసనకోట పంచాయతీని నియోజకవర్గంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే రామగిరి మండలంలోని నసనకోట పంచాయతీకి చెందిన గంగంపల్లి గ్రామంలో పర్యటించారు. స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ ఏడాదిలో చేసిన అభివృద్ధి ప్రతి గ్రామంలో కనిపిస్తోందన్నారు. సంక్షేమ పథకాల విషయంలో అంతటా సంతృప్తి కనిపించిందన్నారు. త్వరలో 15ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి మొక్కను సంరక్షించుకోవాలన్నారు. అన్ని వర్గాల వారు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీత, టిడిపి నాయకులు

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

గ్రామాభివృద్ధిపై సచివాలయ, పంచాయతీ రాజ్ సిబ్బంది దృష్టిసారించాలని స్థానిక ఎంపీడీవో పార్థసారథి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామాభివృద్ధిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం పాటించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామ పంచాయతీ ప్రణాళిక నివేదికలు తయారుచేయడంలో అధికారులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దేవేంద్ర నాయక్, ఎంఇఒ గోపాల్ నాయక్,ఏవో లోకేశ్వర్ రెడ్డి తదితర మండల స్థాయి అధికారులు, సచివాలయ,శిశుసంక్షేమ శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - బుక్కపట్నం

క్షయ వ్యాధి పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, క్షయ వ్యాధి సూపర్వైజర్ ఆబీద్ బాషా, డాక్టర్ సురేష్ తెలిపారు. మండల పరిధిలోని ధూపం పల్లి గ్రామంలో గురువారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు తో పాటు గళ్ళ పడడము, ఛాతిలో నొప్పి ఉండడము, ఉదయము సాయంత్రము జ్వరము రావడం లాంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించి పేరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యక్తి గత, పరిసరాల పరిశుభ్రత పాటించి ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమములో వైద్య సిబ్బంది సుమలత, రాజేశ్వరి ఆశాలు రామలమ్మ. చంద్రావతి, చిన్ని, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

19న ఫ్లోర్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఉమ్మడి అనంతపురం జిల్లా ఫ్లోర్ బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈనెల 19వ తేదీన జరుగుతాయని సత్యసాయి జిల్లా ఫ్లోర్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ పూల శివ ప్రసాద్ తెలిపారు.. అండర్ 14, అండర్ 19 విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 19న శ్రీ సత్యసాయి బాలురు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నారన్నారు. ఈ పోటీలలో ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనాలని తెలిపారు మరిన్ని వివరాలకు 9573065966 నంబరు కు సంప్రదించాలన్నారు .

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - ఓబుళ దేవరచెరువు

మండలంలోని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు పి.విజయమ్మ ఆధ్వర్యంలో బదిలీ అయినఉపాధ్యాయులకు గురువారం పాఠశాల ఆవరణంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బదిలీ అయిన ప్రధానఉపాధ్యాయులు మహమ్మద్ రియాజ్ , పదోన్నత పొందిన మోహన్ రెడ్డి , మహబూబ్‌బాషా , నరసింహారెడ్డి,లక్ష్మీనారాయణ ,మధు బాబు , శంకరప్ప ,పద్మావతి , రాంబాబు , ఖాదర్‌బాషా, నాగరాజుకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరినాథ్ రెడ్డి, సుబ్బిరెడ్డి ,నారాయణ, బాబావల్లి ,రంగరాజు, శశికళ, గాయత్రి, సురేఖ, జనార్ధన, నిర్మలమ్మ , గాయిత్రి, బాబన్న పాల్గొన్నారు.

డ్రై డే పాటించండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని డి.చెర్లపల్లి గ్రామంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయన్న సమాచారంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. అరుణ్ కుమార్ నేతృత్వంలో అత్యవసర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. శానిటేషన్, డ్రైనేజీ వ్యవస్థ శుభ్రతపై కూడా గ్రామ సచివాలయ సెక్రటరీకి అధికారికంగా సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు అశ్వర్థ నారాయణ, గౌరమ్మ, హెల్త్ ప్రొవైడర్ శ్రీదేవి, ఆరోగ్య కార్యకర్త డేవిడ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగిల్ విండో అధ్యక్షురాలిగా చెన్నమ్మ

ప్రజాశక్తి-హిందూపురం

చిలమత్తూరు సింగిల్ విండో అధ్యక్షురాలిగా పార్లమెంటు తెలుగు మహిళా కార్యదర్శి చెన్నమ్మ ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయంలో ఆమె సింగిల్ విండో అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. చెన్నమ్మను ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరిమళ తదితరులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చెన్నమ్మ మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జి ఆకుల ఉమేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకటలక్ష్మి, కౌన్సిలర్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా విజయభాస్కర్

ప్రజాశక్తి - పరిగి

పరిగి మండల డిప్యూటీ ఎంపీడీవో గా విజయభాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత ఏడు నెలలుగా పరిగి ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్స్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన విజయభాస్కర్ ప్రమోషన్ పై పరిగి డిప్యూటీ ఎంపీడీవోగా పూర్తిస్థాయిలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మండల అధికారులతో పాటు కార్యదర్శులు పలువురు నాయకులు విజయభాస్కర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికులను బెదిరిస్తే భయపడం

హిందూపురంలో కార్మికులు, నాయకుల ర్యాలీ

పుట్టపర్తిలో కార్మికులు, నాయకుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

కార్మికులకు న్యాయం చేయాల్సిన అధికారులు, పాలకులు వారిని భయపెట్టాలని చూస్తే భయపడే ప్రశక్తే లేదని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిన్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్ అన్నారు.. సమ్మెలో ఉన్నా కార్మికుల్లో కొంత మందిని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ మల్లి కార్జునలు చైర్మన్ చాంబర్‌లో పిలిపించి వారిని భయభ్రాంతులకు గురి చేయడంపై జగదీష్ మండిపడ్డారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిన్ ఫెడరేషన్ ఆద్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా యూనియన్ ఆద్వర్యంలో కార్మికులు పట్టణంలోని ఇందిరా పార్కు నుండి పుర వీధుల గుండా రహమత్ పురం సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపుతు ప్రభుత్వనికి వ్యతిరేఖంగా నినదాలు చేశారు. అక్కడి నుంచి మున్సిపల్ కార్యలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ సమ్మె చేపట్టారు. ఈ సందర్బంగా జగదీష్ మాట్లాడుతు హిందూపురం మున్సిపాలిటీలో గత 35 సంవత్సరాలుగా పనులు చేస్తూ పట్టణ సుందరీకరణకు సేవలందిస్తున్నారని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా చట్టం ప్రకారం పర్మినెంట్ చేయాలని చట్టాలు ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకుని కార్మికులను పర్మిట్ చేయడం లేదని వాపోయారు. రిటైర్డ్ అయిన తర్వాత ఒక్క నయా పైసా కూడా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే విధులు నిర్వహిస్తు మతి చెందిన కార్మికుల మట్టి ఖర్చులు ఒక్క పైసా కూడా ఇవ్వలేని దుస్థితిలో మున్సిపాలిటీలు ఉండడం దురదృష్టకరమని విచారణ వ్యక్తం చేశారు. చని పోయిన, రిటైర్డ్ అయిన తర్వాత కుటుంబ సభ్యులకు ఉద్యోగం కూడా ఇవ్వడం లేదని, ఉన్నంతకాలం వారితో వెట్టిచాకిరి చేయించు కోవడం కార్మికులను బానిసలుగా చూడడం తప్ప కార్మిక సేవలను గుర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు నిర్వహిస్తూ మృతి చెందిన తొమ్మిది మంది కార్మికుల కుటుంబాలను ఆదుకోలేదన్నారు. వీరి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని గత కొన్ని సంవత్సరాలుగ ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. వీరికి న్యాయం చేయాల్సిన పాలకులు, అధికారులు చాంబర్‌కు పిలిపించి భయభ్రాంతులకు గురిచేయడం బాధాకరమన్నారు.. వెంటనే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో కార్మికుల సత్తా ఎంటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిన్ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాదికారి ఆనంద్, నాయకులు గుర్నాథ్, రామచంద్ర, బాబయ్య, మూర్తి, శంకరా, చంద్రశేఖర్, కుమార్, బాలాజీ, చంద్ర, మూర్తి, కవితమ్మ, గంగ రత్నమ్మ, శోభమ్మ, ఓబులమ్మతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : తమ సమస్యల పరిష్కారం కోసం ఇంజినీరింగ్ కార్మికులు గురువారం వినూత్న నిరసన చేపట్టారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కసారి మా వైపు చూడు, పవనన్న కరుణించు, మంత్రి నారాయణ సమస్య పరిష్కరించు' అంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ముందు అర్ధ నగ్నంగా పడుకొని రెండు చేతులతో మొక్కుతూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చలో విజయవాడకు ఇక్కడి నుంచి తరలి వెళ్లారన్నారు. ఇక్కడ ఉన్న మిగతా కార్మికులు నిరసనలు ఆగకూడదని ఉద్దేశంతో ఈ నిరసన ఐదవ రోజు కొనసాగిస్తున్నామన్నారు. సమస్య పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామదాసు, శివ, సాయికృష్ణ, సాయినాథ్, సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి వైసిపిలో వర్గ విభేదాలు బహిర్గతం

పార్టీ నియోజవర్గ ఇన్‌ఛార్జిపై తీవ్ర స్థాయిలో విమర్శలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి వైసీపీలో వర్గ విభేదాలు తలెత్తాయి. ఆ పార్టీకి చెందిన జడ్పిటిసి, ఎంపీటీసీ ,సర్పంచులు, వైసిపి కీలక నేతలు సమావేశమై వైసీపీ పార్టీ, నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గురువారం పట్టణంలోని జడ్పిటిసి అనిత విశ్వనాథ్ రెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి మక్బూల్ కోసం సొంత డబ్బులు ఖర్చు పెట్టి కుటుంబమంతా కష్టపడి పనిచేశామని అన్నారు. అలాంటి తమపై మక్బూల్ వారి అనుచరులు టిడిపి కోవర్ట్ అని సోషల్ మీడియాలో పోస్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక మహిళ ప్రజా ప్రతినిధి అని చూడకుండా వైసిపి నేతలు సోషల్ మీడియా వేదికగా అసభ్యంగా పోస్టులు పెడుతూ మానసిక వేదనకు గురి చేస్తున్నారని నల్లచెరువు జడ్పిటిసి అనిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసేన జడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచులను ప్రస్తుత వైసిపి సమన్వయకర్త ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. పార్టీ కోసం కష్టపడితే హేళనగా మాట్లాడుతుండారని మహిళా జడ్పిటిసి అనిత భావోద్వేగానికి గురయ్యారు. ఆ పార్టీ కీలక నేత విశ్వనాథరెడ్డి వైసీపీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ కోసం ఆస్తులు అమ్ముకొని పనిచేశామని కుటుంబమంతా వైసిపి కోసం పనిచేస్తే తమపై సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టిస్తున్నారనిఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపిస్తున్న వైసీపీ నేతలకు దమ్ము ధైర్యం ఉంటే ఎక్కడికైనా ప్రమాణానికి రావాలని సవాల్ విసిరారు.

స్థాయికి మించి మాట్లాడితే బుద్ధి చెబుతాం

ప్రజాశక్తి - నల్లచెరువు

తమ స్థాయికి మించిన మాటలు మాట్లాడితే తగిన బుద్ధి చెబుదామని వైసిపి మండల కన్వీనర్ రవి కుమార్ రెడ్డి ఆపార్టీ నాయకులకు హెచ్చరించారు. గురువారం మధ్యాహ్నం వైఎస్ఆర్సిపి నాయకులు ప్రజా ప్రతినిధులతో కలిసి తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూకదిరిలో జడ్పిటిసి భర్త బసిరెడ్డి విశ్వనాథ్ రెడ్డి కదిరి నియోజకవర్గ వైయస్సార్సీపి ఇంచార్జ్ మక్బూల్ అహ్మద్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయాల పట్ల కనీసం అవగాహన లేని ఆయన తమ నాయకుడిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. మైనారిటీ బీసీ ఎస్సీ ఎస్టీ బలహీన వర్గాలకు అండగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కదిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా మక్బుల్ అహమ్మద్ పోటీ చేశారని చెప్పారు. ప్రజా నిర్ణయాన్ని స్వీకరించి. నిరంతరం ప్రజల్లో ఉంటూ కార్యకర్తలకు నాయకులకు అండగా ఉన్నారని అన్నారు. మక్బుల్అహ్మద్ కు వస్తున్న ఆదరణచూసి ఓర్వలేక వైయస్సార్సీపీలోనే ఉంటూ నియోజకవర్గ అధినేతపై విమర్శలు చేయడం మంచిదికాదన్నారు. ఎవరి స్థాయి ఏంటో ప్రజలకు తెలుసునని అన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో జడ్పిటిసిగా చేసిన అభివద్ధి పై శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. ఈసమావేశంలో సర్పంచులు హైటెక్ రమణ, యూసుఫ్, ఎంపీటీసీలు, భాస్కర్ రెడ్డి, సుమియా రఫీ, కోనపల్లి రమణారెడ్డి, మాజీ సర్పంచులు బొమ్మిరెడ్డి నరసింహా రెడ్డి, వెంకటరెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఆనంద్ రెడ్డి, మాజీ సింగల్ విండో డైరెక్టర్ ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు

బదిలీ ఉపాధ్యాయురాలికి సన్మానం

కన్నీరు పెట్టుకున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - పరిగి

ఉపాధ్యాయురాలుకు జ్ఞాపిక అందిస్తున్న విద్యార్థినులు

పదహారేళ్లుగా పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయురాలు సుహాసిని ఆపాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సుహాసిని చేసిన సేవలను కొనియాడారు. పదహారేళ్లుగా ఇక్కడ పనిచేసిన తమ ఉపాధ్యాయురాలు మరో పాఠశాలకు వెళ్తుందన్న విషయాన్ని జీర్ణించుకోలేని విద్యార్థులు, ఉపాధ్యాయురాలిని పట్టుకుని ఏడ్చారు. ఆ వీడ్కోలు కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు సైతం అదే రీతిన స్పందించారు. బదిలీ ఉపాధ్యాయురాలికి పసుపు కుంకుమ చీర అందించిన విద్యార్థులు జ్ఞాపికను అందించారు, సుహాసిని, శ్యామ్ సుందర్ దంపతులకు కన్నీటితో వీడ్కోలు పలికారు.

కలప అక్రమ రవాణాకు చెక్.. వాహనాలు సీజ్

ప్రజాశక్తి కథనాలకు స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

సీజ్ చేసిన ట్రాక్టర్

హిందూపురం పారిశ్రామిక వాడలో పలు పరిశ్రమలు అక్రమంగా కలపను తరలించి పరిశ్రమల్లో వినియోగిస్తున్నారు. ఈ విషయం ఎప్పటికప్పుడు ప్రజాశక్తి దినపత్రిక ప్రత్యేక కథనాల రూపంలో వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ కథనాలపై అటవీశాఖ అధికారులు స్పందించారు. గురువారం పారిశ్రామిక వాడలో అటవీ శాఖ అధికారులు కేశప్ప, రాహుల్ తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో కర్నాటక రాష్ట్రం నుండి గోలాపురం పారిశ్రామిక వాడలోని టెక్స్‌పోర్ట్ గార్మెంట్స్ పరిశ్రమ, ఫ్లాకేం రసాయన పరిశ్రమలకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనుమతులు లేకుండా పరిశ్రమలో కలపను వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె : సిఐటియు

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మున్సిపాలిటీలో కోవిడ్ సమయంలో నియామకం అయిన పారిశుధ్య కార్మికులు శుక్రవారం నుంచి సమ్మెలోకి వెళుతుఉన్నట్లు సిఐటియు నాయకులు తెలిపారు. ఈ మేరకు స్థానిక సి ఐ టి యు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ జెవి రమణ, కో కన్వీనర్ టి,అయూబ్ ఖాన్, సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం బాబు , లక్ష్మీ ఓబులేసు, మాట్లాడుతూ ధర్మవరం మున్సిపల్ పరిధిలో కరోనా సమయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులుగా 87 మందిని విధులలోకి తీసుకున్నారన్నారు. వారికి ఇప్పటివరకు దాదాపు 5 సంవత్సరాలుగా కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. కనీస వేతనం అమలు చేయాలని గత ఏడాదిన్నర కాలంనుంచి, అనేక పర్యాయాలు అధికారులకు అధికార పార్టీ నాయకులకు సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రాలు సమర్పించినా వారిలో ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో వారి సమస్యల పరిష్కారాని శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళుతున్నారన్నారు. పట్టణ జనాభా ప్రతిపాదికన 400 మంది కార్మికులు ఉండవలసిన ధర్మవరం మున్సిపాలిటీలో కేవలం 253 మంది కార్మికుల పైన పని భారం మోపుతున్నారన్నారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికసంఘం నాయకులతో చర్చించి కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, కార్మిక సంఖ్యను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గత 22 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కనీసం ఇప్పటివరకు కార్మిక సంఘాలతో చర్చలు జరగడంలేదని అన్నారు. ని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, ఎస్ హైదరవలి, కార్మిక సంఘం నాయకులు వెంకటరాముడు, బి,ప్రసాద్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు చేయడంలో జగన్ దిట్ట : ఎమ్మెల్యే కందికుంట

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

హత్య రాజకీయాలు చేయడంలో జగన్ దిట్ట అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆరోపించారు. వైసీపీ అధినేత జగన్ తెలుగు నేర్చుకుంటే మంచిదని తెలుగు ప్రజలందరూ సంతోషపడతారని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హితవు పలికారు. గురువారం కదిరి పట్టణంలోని 33 వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్‌తో వారి నాయకులు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళలను గౌరవించలేని వ్యక్తి జగన్ అని సొంత బాబాయ్ ని హత్య చేస్తే పట్టించుకోలేదని విమర్శించారు. మద్యం కుంభకోణంలో విచారణకు జగన్మోహన్ రెడ్డి సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాదున్నిసా, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, వైస్ చైర్‌పర్సన్ సుధారాణి బాబయ్య, కౌన్సిలర్ పాశం రమణమ్మ, రమణ నాయుడు, ఇతర కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు: రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే సింధూర పేర్కొన్నారు.మండల పరిధిలోని మిట్టపల్లి పంచాయతీలోనీ వణుకువారిపల్లిలో నిర్వహించిన సుపరిపాలనతో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ శెట్టి వారి జయచంద్ర , సహకార సొసైటీ నూతన అధ్యక్షులు తుమ్మల మహబూబ్ బాషా , అల్లాపల్లి సహకార సొసైటీ అధ్యక్షుడు బోయపల్లి శివారెడ్డి , మాజీ మండల కన్వీనర్ రాజారెడ్డి , అంజినప్ప , పీట్ల సుధాకర్ , ఆరిఫ్ ఖాన్, షాను, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పట్టపగలు రెండు ఇళ్లలో చోరీ

ప్రజాశక్తి-మడకశిర టౌన్

పట్టణంలోని పావగడ ప్రధాన రహదారిలో పట్టపగలే ఒకే రోజు రెండు ఇళ్లలో భారీ చోరీలు జరిగాయి. పట్టణంలోని నాగేంద్రప్ప, అతడి భార్య ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బ్యాంకుకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లో ఉంచిన రూ. 70 వేల నగదు, బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు ఇంటి యజమాని నాగేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే మరో ఇంట్లో యజమాని గార్మెంట్స్ పనికి వెళ్లడంతో ఆ ఇంట్లో చోరీ జరిగింది. అయితే ఆ ఇంట్లో ఏమేమి చోరీకి గురయ్యాయో వారు వచ్చేంత వరకూ తెలియదని పోలీసులు తెలిపారు. ఈ చోరీలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు తీసుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిలోనే ఒకే రోజు రెండు చోరీలు జరగడంతో పట్టణ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి

ప్రజాశక్తి-పెనుకొండ

పశువులు కాచే ఓ మహిళ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన గురువారం పెనుకొండ మండలంలోని కోనాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కోనాపురం గ్రామానికి చెందిన బోయ క్రిష్టప్ప, బోయ చెన్నమ్మ దంపతులు పాడి పశువులను పెంచుతూ పాలు అమ్ముకుని జీవనం సాగించేవారు. బుధవారం బోయ చెన్నమ్మ వారి పశువులను మేపడానికి కొండాపురం చెరువు సమీపంలోకి వెళ్లింది. సాయంత్రం పశువులు ఇంటికి చేరుకున్నాయి. చెన్నమ్మ మాత్రం రాలేదు. భర్తతో పాటు బంధువులు చుట్టుపక్కల గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం ముత్యాలచెరువులో శవమై తేలింది. విషయం తెలుసుకున్న భర్త, బంధువులు ఘటనా స్థలానికి పెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. వారికి ముగ్గురు కుమార్తెలున్నారు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చెన్నమ్మ భర్త క్రిష్టప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రహరీ కూల్చివేత ఘటనలో 16మందిపై కేసు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలో బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వెనక భాగంలో ఆర్అండ్‌బి ప్రహరీని గురువారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు జెసిబితో తొలగించారు. ఈ సంఘటనపై ఆర్అండ్‌బి ఏఈ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు 16 మందిపై కేసు నమోదు చేసినట్లు సిఐ శేఖర్ తెలిపారు. సిఐ మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించిన ప్రహరీని దౌర్జన్యంగా తొలగించడంపై నిమ్మల శేఖర్, వృషభదేవుడు, దినేష్, ప్రసాద్, జైకృష్ణ, ప్రకాష్, కట్టా నారాయణ, విఠలాచారి, మహేష్, మన్సూర్, గంగాధర్, టెంపో ఆదినారాయణ, జెసిబి డ్రైవర్ రాము, నరేష్, మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

సామాజిక మాధ్యమాల్లో పోస్టులపై కేసు

ప్రజాశక్తి - కదిరి టౌన్

తమ మనోభావాలు దెబ్బతినే విధంగా సోషియల్ మీడియాలో పోస్టులు చేసి తమ పరువు కి భంగం కలిగించే విధంగా ప్రవర్తించారిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఈఘటనపై ఆయన తెలిపిన వివరాలు... కదిరి పట్టణం ఎర్రగుంట పల్లి గ్రామానికి చెందిన కొయ్య సోమ శేఖర్ నాయుడు ఆధ్వర్యంలో కొందరు మీడియా ప్రతినిధులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మీడియా ప్రతినిధులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే ఈ అంశాన్ని సుధాకర్, వినోద్ కుమార్, వేమ ప్రసాద్ తదితరులు వక్రీకరించి కొన్ని వాట్సప్ గ్రూపుల మీడియా ప్రతినిధుల మనోభావాలను దెబ్బతినే విధంగా పోస్టులు చేశారు. ఫోటోలు మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారని సోముశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సిఐ చెప్పారు.

పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల శివారు ప్రాంతాల్లోని పలు అనుమానితుల ఇళ్లలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఓడి చెరువు గ్రామ శివారులో ఉన్న అనుమానితుల ఇళ్లను నల్లమాడ సీఐ నరేంద్ర రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, ఎఎస్ఐ వెంకటరమణ పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు . పాత కేసుల నిందితుల ఇళ్లను పరిశీలించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ, ఎస్ఐ, హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద 10 ఇళ్లలో వరుస దొంగతనాలు జరిగిన నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు, జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి గురువారం రైల్వే స్టేషన్, బస్టాండ్లు లాడ్జిలలో ఆకస్మిక తనిఖీ లు చేపట్టారు. పుట్టపర్తి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద గల లాడ్జిలలో ప్రతీ గదిని తనిఖీ చేసి, రాత్రి వేళల్లో లాడ్జిలులో బస చేసిన వ్యక్తుల వివరాలు సేకరించారు , వారి యొక్క ఆధార్ కార్డులో ఉన్న చిరునామాలను పూర్తిగా రికార్డుల్లో పొందపరచాలని తెలియజేశారు. అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కన్పించేలా ప్రతిచోట సి.సి.కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని లాడ్జ్ యజమానులకు సూచించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

గ్రామాలలో నెలకొన్న రెవిన్యూ భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఆర్డీవో సువర్ణ తెలిపారు. గురువారం మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న రెవెన్యూ భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో భూ సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూ సర్వే, సచివాలయ సిబ్బంది పనితీరు తదితర అంశాలపై సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సభలు ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని రైతులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహులు, వీఆర్వో సుధాకర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

నంద్యాలలో ఈ నెల 20తేదీన జరిగే రైతు సంఘం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, ఆలకుంట మారుతి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో వ్యవసాయ భూములను ప్రవేట్ కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు ఇస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ నంద్యాలలో 20వ తేదీ జరుగు సదస్సులో రైతులు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్నటువంటి రైతాంగ వ్యతిరేక విధానాలను వారు ఎండగట్టారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున, రైతులు నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

వైఎస్ జగన్‌తోనే నా రాజకీయ పయనం

మాజీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నవీన్ నిశ్చల్

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి అధిష్టానం తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే తన రాజకీయ పయనం కొనసాగుతుందని ఆ పార్టీ నుండి సస్పెండ్‌కు గురైన మాజీ ఆగ్రోస్ చైర్మన్ బి. నవీన్ నిశ్చల్ పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం ఆయనను సస్పెండ్ చేసిన నేపథ్యంలో గురువారం తన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా తనపై కక్ష కట్టి రాజకీయ కుట్రలో భాగంగానే వైసీపీ నుంచి తనను సస్పెండ్ చేయించారని ఆరోపించారు. తనపై వైసీపీ అధిష్టానానికి తప్పుడు ఫిర్యాదులు చేశారని, దానిపై అధిష్టానం పూర్తిస్థాయిలో విచారణ చేసి ఉంటే బాగుండేదని అన్నారు. తాను వైసిపి లో క్రియాశీలకంగా వ్యవహరిస్తుండటం కొన్ని దుష్ట శక్తులకు నచ్చలేదన్నారు. దీంతో తనపై తప్పుడు ఫిర్యాదులు చేశాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ టికెట్ తనకు దక్కుతుందనే ఉద్దేశంతో ఇప్పటి నుంచే తనపై కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. హిందూపురం నియోజక వర్గంలో ఎవరి బలం ఎంతో ప్రజలందరికీ బాగా తెలుసునని నవీన్ పేర్కొన్నారు. గత ఎన్నికల ముందు నుంచే తనపై రాజకీయ కుట్రలు మొదలు అయ్యాయని గత ఎన్నికల ముందు కొన్ని దుష్ట శక్తులు పార్టీలో చేరాయని, దానివల్ల పార్టీ పరిస్థితి దిగజారిందని ఆరోపించారు. వైసిపి అధిష్టానం తనను సస్పెండ్ చేసినా నష్టం లేదని, తనను సస్పెండ్ చేయడం వల్ల పార్టీకి లాభమో.. నష్టమో త్వరలోనే పార్టీ అధిష్టానానికి తెలుస్తుందని అన్నారు. తాను ఎక్కడా జగన్ మోహన్ రెడ్డికి, పార్టీ కి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదని, తన రాజకీయ ప్రయాణం జగన్మోహన్ రెడ్డి తోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. వరుసగా రెండు ఎన్నికల్లో టికెట్ ఇవ్వక పోయినా జగన్ మోహన్ రెడ్డిపై ఉన్న అభిమానంతో పార్టీ కోసం పనిచేశానని నవీన్ చెప్పారు. కొంతమంది నాయకులు తమ వైఖరి వల్ల హిందూపురం నియోజకవర్గం లో వైసిపిని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. తనను నమ్ముకున్న క్యాడర్ కోసం ఎవరితోనైనా ఎంత ఎంతవరకైనా పోరాడుతానన్నారు. తమ కార్యకర్తలు,అభిమానులు రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకొమన్నా దానికి సిద్ధంగా ఉంటానని నవీన్ స్పష్టం చేశారు. తన తండ్రి డాక్టర్ సాయి ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ పేరిట ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని, ఇకపై మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని నవీన్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నవీన్ నిశ్చల్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మందులు కొన్న ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలి : ఎడిఎ

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఎరువుల దుకాణాలలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు కొన్న ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని పుంగనూరు ఏడీఏ శివకుమార్ ఆదేశించారు. గురువారం బత్తలపల్లి మండలంలో డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వారి ఆదేశాల మేరకు పుంగనూరు ఏడీఏ శివకుమార్, విజిలెన్స్ డిపార్ట్మెంట్ ఎం శివన్న, వ్యవసాయ అధికారి ప్రసాద్, బత్తలపల్లి మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి తదితరులు పలు ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనిఖీలలో 15.105 మెట్రిక్ టన్నుల రూ.3.05లక్షల విలువ కలిగిన ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు తెలిపారు. మండలంలోని ఎరువులు, విత్తన దుకాణదారులు ఖచ్చితంగా స్టాక్ రిజిస్టర్లు అప్డేట్ చేసుకోవాలన్నారు. ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొన్న ప్రతి రైతుకు తప్పక బిల్లులు ఇవ్వాలన్నారు. స్టాక్ బోర్డు పైన స్టాక్ వివరాలు నమోదు చేయాలని, ఎరువుల రోజు వారీ అమ్మకపు వివరాలను ఈపాస్ మిషన్ నందు తప్పక నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీ అధికారులు వస్తున్నారని తెలుసుకున్న పలు షాపుల యజమానులు తమ దుకాణాలను మూసివేశారని వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామని ఏవో ఓబిరెడ్డి హెచ్చరించారు.

కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూ పరపాలక సంఘంలో పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్, ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన, రిటైర్డ్ అయిన కార్మిక కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున కార్మికులకు భరోసా ఇచ్చారు. గురువారం మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ తన ఛాంబర్ లో సమ్మెలో ఉన్న కొంతమంది కార్మికులను పిలిపించుకొని మాట్లాడారు. పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తూ రిటైర్డ్ అయిన 17 మంది కార్మిక కుటుంబాలతోపాటు విధులు నిర్వహిస్తూ మృతి చెందిన తొమ్మిది మంది కార్మిక కుటుంబాలలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఎమ్మెల్యే సూచనల మేరకు ఇప్పటికే 17 మంది కార్మికులకు విధుల్లోకి తీసుకునేందుకు సాంకేతిక సమస్యలు అధిగమించి కార్యరూపం తీసుకొచ్చామన్నారు. మరో నాలుగు రోజుల్లో వీరందరికీ నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు. మిగిలిన కార్మిక కుటుంబాలు ఒకరికి ఉద్యోగం వచ్చే విధంగా కార్యాలయం నుంచి అవసరమైన పత్రాలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి, జిల్లా కలెక్టర్ సంతకాలు కాగానే 15 రోజుల్లో వీరికి సైతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వపరంగా విధానాల విషయంలో ఆలస్యం అవుతుందన్నారు. మూడు రోజుల్లో సమస్యలను పరిష్కారం చేస్తామని చెప్పారు.

బహుజనుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రధాన పార్టీలు

బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో బీసీ కార్డుతో అధికారుల్లోకి వచ్చిన టిడిపి, ప్రధాన ప్రతిపక్షం వైసీపీ బహుజన సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని బి ఎస్ పి రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి శ్రీరాములు విమర్శించారు. గురువారం పట్టణంలోని బి.ఎస్.పి కార్యాలయంలో హిందూపురం నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గ ఉపాధ్యక్షులు సుబ్బరాయప్ప అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా శ్రీరాముల తో పాటు జిల్లా అధ్యక్షులు వల్ల కుంట వడ్డే నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలు బహుజనల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి సంపాదన ధ్యేయంగా పాలన సాగిస్తున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు కేవలం ఆకర్షణీయమైన పథకాలను ఆశ చూపి మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ రెండు పార్టీలు కేంద్రంలో ఉన్న మతతత్వ బిజెపి పార్టీతో పొత్తు కోసం పోటీ పడి ప్రజలకు మేలు చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ఏడాది కాలంగా చేసింది ఏమీ లేదన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో విరివిగా స్థానాలను గెలుచుకునే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అప్పుడే బహుజనులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో బి.ఎస్.పి నాయకులు మౌలాలి, నాగరాజు, తిరుమలేష్, వెంకటరాముడు, గంగాధరప్ప, రామాంజినప్ప, నారాయణప్ప, సురేష్, శంషాద్, పల్లా నరసింహులు, సుబ్బన్న, రమేష్, చంద్రశేఖర్, ఆదినారాయణ, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

ఉద్యోగాన్ని సేవగా భావించండి. : ఆర్డీవో

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

చేస్తున్న ఉద్యోగాన్ని పనిలా కాకుండా సేవగా భావించి పనిచేయాలని ఆర్డీవో సువర్ణ సూచించారు. చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, మిషన్ వాత్సల్య , వైద్యశాఖ ఆధ్వర్యంలో పుట్టపర్తి మండల సమాఖ్య సమావేశపు భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో మాట్లాడుతూ ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరూ పనిగా కాకుండా కమ్యూనిటికి సేవ చేసే భాగ్యంలా భావించి పని చేస్తే అందులో సార్థకత లభిస్తుందని తెలిపారు. పుట్టపర్తి డివిజన్ స్థాయిలోని వైద్య శాఖలో ఉన్న ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్ఒ, ఆశా కార్యకర్తలకు లైంగిక , పునరుత్పత్తి, ఆరోగ్యం , హక్కులు గురించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్లక్ష్యానికి గురైన బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రోజు వారీ కార్యక్రమాలలో భాగంగా అవగాహన కార్యక్రమాలు తప్పనిసరిగా చేయాలని బాలల హక్కులు కాపాడటం పిల్లల చట్టాలు అములు చేయడం ,బాల్య వివాహాలు జరగకుండా చూడటం లాంటి వాటిపై అవగాహన కల్పించారు పుట్టపర్తి డివిజన్‌లోని ప్రతి బిడ్డకు సురక్షితమైన ఆరోగ్యాన్ని అందించాలని ఆర్డీవో కోరారు. ఈ సందర్భంగా సైబర్ భద్రత గురించి తెలిపే పుస్తకాన్ని విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో సిఐఎఫ్ జిల్లా కోర్డినేటర్ కొండప్ప, డిసిపిఒ మహేష్, వైద్యశాఖ చంద్రనాయక్, సుశీలమ్మ, డిప్యూటీ హెచ్ఇఒలు రామ్మోహన్ హెల్త్ సూపర్‌వైజర్, సోసియల్ వర్కర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని విడుదల చేస్తున్న ఆర్డీవో, తదితరులు

నేత్ర దానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోనియాదవ వీధి కి చెందిన వేల్పుమడుగు ఆంజనేయులు(62) గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. యువర్స్ ఫౌండేషన్ వారు మృతునికుటుంబ సభ్యులకు నేత్రదానం పై అవగాహన కల్పించి వారి సహకారంతో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అందత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డి వై. కుళ్లాయప్ప కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర,ఆప్తమలిక్ ఆఫీసర్ షేక్ సికిందర్ తదితరులు మృతుని నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని సోదరులు వేల్పుమడుగు రాము స్టూడియో, ప్రసాద్ కు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ శ్రీనివాసులు,డాక్టర్. సుబ్బారావు, కేతా లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి : ఆర్డీవో

భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్డీవో

ప్రజాశక్తి - చిలమత్తూరు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కస్తూరిబా విద్యాలయం, డివి అండ్ ఆర్ జూనియర్ కళాశాల సిబ్బందికి పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ సూచించారు. గురువారం చిలమత్తూరు సమీపాన గల బైరేకుంట వద్ద గల కేజీవీబీ విద్యాలయతో పాటు పక్కనే ఉన్న జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. కళాశాలకు సంబంధించి కేటాయించిన భూమి స్థితిగతులు గూర్చి ఆరా తీశారు. కళాశాలకు కేటాయించబడిన భూమిలో ప్రైవేటు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్న వివాదాస్పద భూమి గూర్చి మండల సర్వేయర్ తో మ్యాప్ తో పాటు రికార్డు గూర్చి అడిగి తెలుసుకొని భూమిని పరిశీలించారు. అక్కడి నుండి ప్రక్కనే ఉన్న కస్తూరిబా విద్యాలయంలోకి వెళ్ళి కాసేపు సిబ్బంది తో చర్చలు జరిపి, డైనింగ్ హాల్ పరిశీలించి విద్యార్థులకు అక్కడే వండుతున్న వంటలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కేజీవీబీకి కేటాయించిన భూమి సరిపోలేదని, పిల్లల ఆట స్థలానికి ఇంకా అదనంగా భూమిని కేటాయించాలని కేజీవీబీ సిబ్బంది ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన పరిశీలించి నివేదిక పంపాలని తహశీల్దార్ నటరాజ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి, వైద్యాధికారిని తేజస్విని, ఆర్ఐ నేలకోటప్ప, రెవిన్యూ, కేజీవీబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి గ్రామసభలు : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఈనెల 18 నుంచి గ్రామసభలు నిర్వహించి బంగారు కుటుంబాలను మార్గదర్శాలను గుర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రామాల్లో సభలు జరిగే విధంగా జిల్లా అధికారులు ఆర్డీవోలు చర్యలు తీసుకోవాలని అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని మానిటరింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, కదిరి ఆర్డీవోలు సువర్ణ, మహేష్, ఆనంద్ కుమార్, ఎస్ ఎస్ వి వర్మ, సిపిఓ విజయకుమార్, పరిశ్రమల జిఎం నాగరాజు, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డీఎస్ఓ వంశీకృష్ణ రెడ్డి, మైన్స్ డిడి పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.